## క్లుప్తంగా

### ఫ్లెక్సీల తొలగింపు

కుల్కచర్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని రాజకీయ పార్టీలు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ప్రధాన కూడలిలో బీజేపీ నేతల ఫొటోలతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేయగా.. తహసీల్దార్ ఆదేశాలతో వాటిని తీసేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, రాజకీయ నేతల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించ రాదని అధికారులు ఆదేశించారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో సంగెంకలాన్ గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని మాజీ సర్పంచ్ సంగెం మేఘనాథ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామానికి చెందిన సిద్దు ఇంటి నుంచి పాఠశాల వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి, గ్రామాన్ని వృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో గ్రామస్తులు నర్సింహులు, అమర్‌నాథ్‌గౌడ్, సోమన్న, బోనప్ప, రాజు, హన్మంత్, ముస్తఫా ఉన్నారు.

### శ్రీశైలం వెళ్లిన శివభక్తులు



ఇరుముడులతో శివభక్తులు

కుల్కచర్ల: పలువురు శివ భక్తులు.. శుక్రవారం మండల కేంద్రం మల్లికార్జున సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లారు. బండవెల్కిచర్ల, బొంరెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలు బండవెల్కిచర్ల గ్రామం శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఇరుముడులు ధరించి, రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజల అనంతరం మల్లికార్జునిడి చెంతకు బయల్దేరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: పరిగి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వివిధ గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఖాజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ, సుల్తాన్‌పూర్, లక్ష్మీదేవిపల్లి, నస్కల్, బర్కత్‌పల్లి, రుకుంపల్లి, బసిరెడ్డిపల్లి, రంగాపూర్, నజీరాబాద్, న్యామత్‌నగర్, మాదారం, పేటమాదారం గ్రామాలతో పాటు పరిశ్రమలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయన్నుట్లు ఆయన వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

కుల్కచర్ల: అనాథ శవానికి గ్రామపంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు చేశారు. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉందన్న సమాచారంతో.. ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతురాలు తిర్మలాపూర్ గ్రామానికి సత్యమ్మ(70)గా గుర్తించారు. ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో జీపీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

### తిరుపతిరెడ్డి కోలుకోవాలి..



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి త్వరగా కోలుకోవాలని మైనార్టీ నాయకులు ప్రార్థనలు చేశారు. పట్టణంలోని జామామజీద్ వద్ద శుక్రవారం హజ్రత్ నిజామొద్దీన్ షహీద్ దర్గాలో ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనారోగ్య కారణాలతో తిరుపతిరెడ్డి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ఆయన త్వరగా కోలుకొని మనమధ్యకు రావాలని అల్లాను కోరుకున్నామని పేర్కొన్నారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎం గౌసన్, మైనార్టీ నాయకులు ఆసిఫ్‌ఖాన్, హమీద్, ఎండీ సలీం, రహీం పాల్గొన్నారు.

### నేత్రదానంతో కంటిచూపు

చేవెళ్ల: ఇక్కారెడ్డి గూడానిక చెందిన గణపతి కృష్ణారెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. 2015లో గ్రామస్తులంతా కలిసి నేత్రాలను దానం చేస్తామని అంగీకార పత్రాలను ఆసుపత్రికి అందజేశారు. మాట ప్రకారం కృష్ణారెడ్డి నేత్రాలను దానం చేశారు.



వికారాబాద్ అర్బన్: బుగ్గరామలింగేశ్వర ఆలయంలో.. శివలింగానికి అభిషేకం



తాండూరు టౌన్: భద్రప్ప ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



కొడంగల్: శివుడి దర్శనం కోసం బారుల తీరిన భక్తులు

# హరహర మహాదేవ శంభో శివ శంకర

## ఘనంగా శివరాత్రి సంబురాలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

దౌల్తాబాద్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహదేవ శంభో శంకర అంటూ శివనామస్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా అభిషేక ప్రియుడికి అర్చనలు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు.. ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం దీక్ష విరమించారు.

**మనుషులంతా ఒక్కటే..**

కుల్కచర్ల: భక్తిమార్గం అనేది వ్యక్తి మానసిక పరివర్తనకు, ప్రశాంతతకు దోహదపడుతుందని ముస్లిం సంఘం నాయకుడు, ఆర్‌ఎంపీ వైద్యుడు ఖుద్దూస్ అన్నారు. శివరాత్రి సందర్భంగా ఉపవాసం ఉన్న భక్తులకు ఆయన పండ్లు పంపిణీ చేశారు. మతం అనేది వ్యక్తిగతమైన ఆచారమని, మనుషులందరూ ఒక్కటే తమ అభిమతమని పేర్కొన్నారు. ఎవరి మతాన్ని వారు గౌరవించుకుని, అండగా నిలవాలని సూచించారు.

**ప్రత్యేక ఏర్పాట్లు**

పరిగి: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి, శివుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజాలు చేశారు. ఈ సందర్భంగా జాగరణ చేసేందుకు వచ్చే భక్తజనానికి ఆలయాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



తాండూరు రూరల్: భూకైలాస్‌లో భక్తజనం

**'బ్రహ్మకుమారీ'స్ ఆధ్వర్యంలో..**

తాండూరు టౌన్: బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, భక్తులంతా ఉపవాస దీక్షతో భగవంతుడికి చేరువవుతారని తెలిపారు. భక్తితో పాటు, సమాజంలో విద్య, కుల, మత సంస్కరణలకు తమ వంతు సేవలందించే సమాజం ఆలోచనలు దీర్ఘకాలిక ఫలితాలనిస్తాయని కొనియాడారు. వారికి తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

### భూకైలాస్‌లో భక్తుల కోలాహలం



హారతి పడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: శివరాత్రి సందర్భంగా మండల పరిధి అంతారంతండా ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం భక్తజనసంద్రంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి, శివుడికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. నీటిమార్గం గుండా వెళ్లి, స్వామిని దర్శించుకున్నారు. భూకైలాస్‌లోని మహాశివుడికి రుద్రాభిషేకం, 12 జ్యోతిర్లింగాలకు అభిషేకంతో పాటు చండీయాగం చేశారు. తండాలోని భవానీమాత విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా గిరిజనులు.. నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా.. అమ్మవారి సన్నిధికి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇందులో ఆల్ ఇండియా బంజార సేవా సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్ పవార్, ఆలయ వ్యవస్థాపకుడు వాసుపవార్‌లు ఉత్సవాలను పర్యవేక్షించారు. పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. భూకైలాస్‌లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ వ్యవస్థాపకుడు సన్మానించారు.

### లింగమయ్యకు పంచామృతాభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

కొడంగల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవలాయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా పరమ శివుడికి ప్రీతి పాత్రమైన పండ్లను నైవేద్యంగా సమర్పించారు. లింగమయ్యకు భక్తులు పంచమృతాభిషేకం నిర్వహించారు. పట్టణంలోని గాడిబాయి శివాలయం, మహాదేవుని ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. భక్తులు లింగమయ్యకు పూలు, పత్రి, పండ్లు, పాలు, తేనే, పెరుగు, చక్కెర తదితర ద్రవ్యాలతో అభిషేకం చేశారు. భక్తులు హరహర మహదేవ శంభో శంకర అంటూ ముక్కంటి దర్శనం కోసం బారులు తీరారు. కోరిన కోరికలు తీర్చే భోళా శంకరునికి భక్తితో పూజలు చేశారు. ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**మహాదేవుని అలంకరణలో శివుడు**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయం శివాలయంలో పరమ శివుడు మహాదేవుని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

**దోమలో..** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు బారులు తీరారు. ఉపవాస దీక్షలతో శివలింగానికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఊటుపల్లి గ్రామంలో భక్తులు మల్లన్న స్వామికి పల్లకీ సేవ చేశారు. మైలారం శ్రీ వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.



దౌల్తాబాద్: విశేష అలంకరణలో నీలకంఠుడు



వికారాబాద్ అర్బన్: బుగ్గలో అభిషేకం చేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి దంపతులు



పెద్దేముల్: శంభులింగేశ్వర దేవాలయంలో సహస్ర దీపార్చన



దోమ: మల్లన్నస్వామికి పల్లకీ సేవ



పరిగిలో..



బంట్వారం: బుగ్గాపూర్‌లో రామలింగేశ్వరుడికి పూజలు



కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర ఆలయంలో బారులు తీరిన భక్తులు



పూడూరు: దామగుండం రామలింగేశ్వర సన్నిధిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు



బొంరాస్‌పేట: పోలెపల్లి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం



ధారూరు: కపిలేశ్వర స్వామికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

# నిర్భయంగా ఓటు వేయండి..

**డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి**

తాండూరు టౌన్: పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజల్లో అభద్రతా భావాన్ని పోగొట్టేందుకు శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలు (ఐటీబీపీ), తాండూరు పరిధి పోలీసులు సంయుక్తంగా పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో పార్లమెంటు ఎన్నికలు కొనసాగేలా పూర్తిస్థాయి బందోబస్తు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ, సాయుధ బలగాలు, పోలీసులు

### బహుజన రాజ్యమే లక్ష్యం

షాబాద్: బహుజన రాజ్య నిర్మాణమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీఎస్పీ ఎన్నికల నిర్వహణ ఇన్‌చార్జి విజయ ఆర్య క్షత్రియ పిలుపునిచ్చారు. శుక్రవారం షాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పనిచేయాలని సూచించారు. మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే పోరాటం విస్తృతం చేయాలన్నారు.

**చేవెళ్ల ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్**

బీఎస్పీ చేవెళ్ల ఉపాధ్యక్షుడిగా నాగర్‌కుంట గ్రామానికి చెందిన మల్లీ వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విజయ ఆర్య క్షత్రియ తెలిపారు. అసెంబ్లీ ఇన్‌చార్జి రాజమహేంద్రవర్మ, జిల్లా ఇన్‌చార్జి జామ చంద్రన్, అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు చందు తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వికారాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసు సిబ్బందిని సన్మానించిన సీఐ నాగరాజు - అనంతగిరి

# అన్నింటా ఆమె

## ఆర్థిక రంగం నుంచి అణుశక్తి వరకు..

- అన్ని రంగాల్లో 'రాణి'స్తున్న అతివలు
- వారిని గౌరవించడం మన సంప్రదాయం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు



తాండూరు రూరల్: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ విమల



పరిగి ఆర్టీసీ డిపోలో..

తాండూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా ఎదగాలని కరన్‌కోట్ ఎస్‌ఐ-2 విమల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధి గౌతపూర్‌లో అన్నపూర్ణ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కూలీ పని నుంచి, అంతరిక్ష ప్రయోగాల వరకూ ఆడవారి పాత్ర ఎనలేనిదని చెప్పారు. స్త్రీలు స్వయంగా ఆర్థిక స్వావలంబన సాధిస్తూ, ఇతరులకు ఉపాధి కల్పించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ, మహిళా కానిస్టేబుళ్లను నిర్వాహకులు సన్మానించారు. ఇందులో ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ మహిళ కన్వీనర్ శకుంతల దేశ్‌పాండె, కానిస్టేబుళ్లు శకుంతల, ఫరీన్, అనిత, గ్రామస్తులు పుష్పలత, సద్గుణ, మహేశ్వరి, విజయలక్ష్మి, ఉమశ్రీ, కమలమ్మ, మణెమ్మ, సుమిత్ర, సుజాత, అనురాధ ఉన్నారు.

**యాలాలలో..**

యాలాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా మహిళా హెడ్‌కానిస్టేబుల్ నర్సమ్మ, కానిస్టేబుల్ అమృతలను ఘనంగా సన్మానించారు. ఇందులో సిబ్బంది హన్మంతు, శ్రీకాంత్, నరేష్, బలరాం ఉన్నారు.



మోమిన్‌పేట: కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సీఐ

**వంటింటిని వదలండి..**

పరిగి: ఉమెన్స్ డే సందర్భంగా ఆర్టీసీ డిపోలో మహిళా ఉద్యోగులు కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం డీఎం కరుణశ్రీ మాట్లాడారు. ఆడవారు అన్ని రంగాల్లో రాణించాలని, అందుకు తమవంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. అతివల అభ్యున్నతికి ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని, కావున వంటింటిని వదిలి, బాహ్యప్రపంచలోకి రావాలని పిలుపునిచ్చారు.

**మన సంప్రదాయం**

మోమిన్‌పేట: మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని సీఐ ఆంజనేయులు అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా ఐదుగురు కానిస్టేబుళ్లను.. ఆయన శాలువాతో సన్మానించి మాట్లాడారు. అమ్మాయిలను ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యను అభ్యసించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారని, మగ పిల్లలతో సమానంగా చూడటం శుభపరిణామమన్నారు. ఇందులో ఎస్‌ఐ అరవింద్, మర్పల్లి, నవాబ్‌పేట ఎస్‌ఐలు ఉన్నారు.



యాలాల: కానిస్టేబుళ్లను సన్మానించిన ఎస్‌ఐ

**'ఉపాధి'వేటలో ఉమెన్**



బొంరాస్‌పేట: ఉపాధి పనుల్లో మహిళలు

బొంరాస్‌పేట: స్వయం శక్తికి నిదర్శనంగా అనాధిగా 'ఆమె' నిలుస్తోంది. బతుకు పోరాటంతో నిరంతరం చెమటోడుస్తుందనడానికి ఈ చిత్రమే సాక్ష్యం. మహిళా దినోత్సవం రోజున జాతీయ ఉపాధిహామీలో భాగంగా మండల పరిధి రేగడిమైలారం దొరచెర్వులో మగవారితో సమానంగా మహిళలు పనిచేస్తున్నారు.